
# జగన్నాథ రథ చక్రాలు

* రచన: శ్రీ ఎ. యం. అయోధ్యా రెడ్డి *



శంకరం పోస్టుమెన్ అందించిన ఇంటర్వ్యూ కాల్ వంక ఒక్క నిమిషంపాటు అప్పుడే పురిట్లో కళ్ళు తెరిచిన పదవ సంతానాన్ని వీక్షించే ఎన్.జి.ఓ. లా నిర్నిమేష దృక్కులతో చూసాడు. నిమిషం తర్వాత నిర్లిప్తమైన మందహాస మొకటి చేసి, కాగితాన్ని మడచి పైజామా జేబులో పెట్టేస్తూ భారంగా నిట్టూర్చాడు.

నిరుద్యోగిగా శంకరం సర్వీసు రెండు సంవత్సరాలు. అతను బి.ఏ. యూనివర్శిటీ ఫస్టు. అయితే నేం లాభం? నేటి సాంఘీక వ్యవస్థలో ఆ క్వాలిఫికేషన్ యెందుకూ పనికి రాకుండా పోయింది.

ఉద్యోగంకోసం శంకరం తిరగని ఆపీసు లేదు. ప్రతి చోటా 'నో వేకెన్సీ' బోర్డులే అతనికి స్వాగతం చెప్పాయ్. అయినా చొచ్చుకు వెళ్ళాడు.

అంతమాత్రాన ఉద్యోగమిచ్చే నాథు డెవరు?

ఎక్కడ చూసినా పెదవి విరుపులూ-చీదరింపులూ.

ఉద్యోగం గూర్చిన వేటలో అలసిపోయా డతను.

ఇంటర్వ్యూ లంటే క్రమంగా శంకరానికి తేలి భావం వచ్చేసింది. ఇదివరకటిలా అంటే మొదట్లోగా ఆదుర్దాపడటం, ఆనందంతో తల మునకలవడం లాంటి పనులు చేయటం మానుకున్నాడు.

కారణం!...

ఈ గడచిన రెండేళ్ళలో అతను అటెండయిన ఇంటర్వ్యూలకు లెక్కలేదు. ఏ వొక్కరూ అతని క్వాలిఫికేషన్‌కు విలువనిచ్చినట్లుగా గుర్తులేదు. అవంటే విసిగి వేసారిపోయాడు.

మరో సారి బరువుగా నిట్టూర్చి వెనుదిరిగి ఇంట్లో అడుగుపెట్టాడు శంకరం.

'ఏంవిటండీ అది?' ఆత్రుతగా ఎదురువచ్చిన భార్య వంక జీవంలేని చూపొకటి చూసి కవరు తీసి చేతిలో వుంచాడు.

'ఇంటర్వ్యూ! హైదరాబాదులో!!' కాగితాన్ని మడచి దీర్ఘంగా నిశ్వసించింది సరస్వతి.

'వెళతారా?' అంది భర్త వదనంలోకి పరిశీలనగా చూస్తూ.

శంకరం నేరస్థునికి మల్లే తలవంచుకున్నాడు.

'నేను వెళ్ళ దల్చుకోలేదు సరూ!' అన్నాడు మెల్లగా.

'అదేమిటి? ఎంచేత?'...

'ఆ ఉద్యోగం నాకురాదు సరూ! వృధాప్రయాస' అతని గొంతులో అవ్యక్తమైన కసి తొంగి చూసింది.

'అలాగంటే ఎలాగండీ! ప్రయత్నం మట్టుకు చెయ్యాలిగా' సరస్వతి కాస్త ముందుకువచ్చి శంకరం భుజంపైన చెయ్యివేస్తూ అంది మృదువుగా.

భార్య వదనంలోకి చూసి మెల్లగా నవ్వాడు శంకరం. తర్వాత వెళ్ళి క్రింద పరిచివున్న చాపమీద చతికిలబడుతూ విషాదంగా అన్నాడు—

'అయితే నన్ను హైదరాబాదు వెళ్ళమంటావా సరూ?'

'వెళ్ళీరండి'

'మరి...మరి ఎలాగ? హైదరాబాదు వెళ్ళాలంటే కనీసం ఏభై రూపాయలైనా కావాలి'

'ఏభై రూపాయలకోసం అవకాశాన్ని కాలదన్నుకుంటారా?'

'కాలదన్నుకోవాలని నేనూ అనుకోవటం లేదు. కాని...!'

'మరెందుకు సందేహిస్తున్నారు?'

'అదే సరూ! డబ్బుగురించి...'

'డబ్బుగురించి మీరేమీ సందేహించకండి. నే నిస్తాను డబ్బు, మీరు మాత్రం బయలుదేరండి'

'ఏమిటీ!' చాపలో వెల్లకిలా పడుకొని కప్పుకేసి నిశితంగా చూస్తున్న శంకరం ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు. తలెత్తి విచిత్రంగా సరస్వతి ముఖం లోకి చూస్తూ నమ్మలేనట్లుగా ప్రశ్నించాడు.

'సరూ! నీదగ్గర డబ్బుందా!!'

'అవును. ఆ విషయంలో మీరేమీ ఆలోచించకండి. రేపే ఇంటర్వ్యూ. ఈ రోజు సాయంత్రం బయలుదేరి వెళితేగాని చేరుకోలేరు. ఉండండి నేను ఇప్పుడే వస్తాను' నిశ్చలంగా, గంభీర స్వరంతో పల్కి లోపలకు వెళ్ళిపోయింది సరస్వతి.

భార్య అంతర్య మేమిటో శంకరానికి అంతుబట్ట లేదు. సరస్వతి దగ్గర అంత డబ్బుందంటే అతను నమ్మలేకపోతున్నాడు. రెండు రోజులుగా పిల్లలూ, తమూ పస్తులుంటున్నా లెక్క చెయ్యకుండా భార్య అంత డబ్బు తన దగ్గర దాచి వుంచుకుందంటే ఏమిటో మాయగా వుంది.

దీర్ఘంగా ఆలోచిస్తూ వుండిపోయాడు శంకరం.

*　　*　　*

చేతి సంచితోపాటు సరస్వతి అందించిన మంగళ సూత్రంవైపు అచేతనంగా చూస్తుండిపోయేడు శంకరం. అతని చూపు భార్య మెడలో వ్రేళాడుతున్న పసుపు కొమ్ముమీద నిలిచిపోయింది. ఒక్కసారి కళ్ళల్లో గిర్రున నీరు తిరిగింది.

'ఏమిటిది సరూ' విచలికంగా భార్య కళ్ళలోకి చూసాడు.

సరస్వతి విషాదంగా నవ్వింది 'తీసికెళ్ళండి! అది అమ్మితే ఏభై రూపాయలు రావంటూరా?'

'సరూ!' భార్యను ఆర్తిగా గుండెలకు హత్తుకుని మౌనంగా కన్నీరు కార్చాడు శంకరం.

'ఇక వెళ్ళండి! ఈ సారి మీకా ఉద్యోగం తప్పకుండా వస్తున్నదని నాకు గట్టి నమ్మకముంది'

సరస్వతి మాటలకు ఉదాసీనంగా నవ్వి బయటకు నడిచాడు నిరుద్యోగి శంకరం.

*　　*　　*

శంకరం ఇంటర్వ్యూ ఆఫీసుకు చేరుకునే సరికే అక్కడ క్యూ కొండవీటి చేంతాడులా పెరిగిపోయింది. అతను నెంబరు ప్రకారం వెళ్ళి క్యూలో నుంచున్నాడు. ఇంటర్వ్యూ ప్రారంభమైంది. కళ్ళల్లో ఆశలు వెలిగించుకొని లోనికి వెళ్ళినవాళ్ళంతా వచ్చేటప్పుడు నిరాశా వదనాలతో తిరిగివస్తున్నారు.

శంకరం మనసులో దైవాన్ని ప్రార్థిస్తు ఇంటర్వ్యూ గదిలో ప్రవేశించాడు. అక్కడ టేబుల్ వెనకాల కుర్చీలో ఠీవీగా ఆసీనుడైవున్న ఆఫీసర్ని చూసి, 'నమస్కారం' అన్నాడు రెండు చేతులూ జోడించి వినయంగా.

అతను హుందాగా తలపంకించి 'సిడౌన్!' అన్నాడు గంభీరంగా. శంకరం భయపడుతూనే వెళ్ళి ఆఫీసరుకు ఎదురుగావున్న కుర్చీలో కూర్చున్నాడు.

మొదటి ప్రశ్నగా పేరు, క్వాలిఫికేషన్ ఇతర వివరాలు అడిగేడు. సర్టిఫికెట్లు అడిగి చూసాడు.

మూడు సంవత్సరాల అవిరామ కృషికి చిహ్నంగా వున్న ఆ డిగ్రీని తేలిగ్గా ఓసారి చూసి ప్రక్కన వుంచాడు.

రాజకీయంగానూ, ఆర్థికంగానూ మన దేశం ఇతర దేశాలతో ఎదుర్కొంటున్న ముఖ్య సమస్యలపైన, భారత హాకీ జట్టు ఈమధ్య సాధించిన ఘన విజయాల పైనా కొన్ని ప్రశ్న లడిగాడు.

అన్నిటికీ ధైర్యంతో విజయవంతంగా సమాధానం చెప్పాడు శంకరం.

'ఇక నువు వెళ్ళచ్చు. మరో గంట తర్వాత బయట బోర్డుమీద వేస్తారు ఎవరు సెలక్టయినదీ!' అన్న ఆఫీసరు మాటలతో లేచి బయటకు వచ్చాడు శంకరం. అతనిలో అంతక్రితం వున్న ఉత్సాహం లేదు. ఏదో భయం! తను సెలెక్ట్ అవుతాడా అన్న అనుమానం 'ఏది ఏమైనా తాను మరో గంటదాకా వెయిట్ చెయ్యక తప్పదు' అనుకున్నాడు.

అన్నప్రకారం నోటీసు బోర్డుమీద రిజల్టు కాగితం అతికించారు. శంకరం సెలెక్టు కాలేదు. మిస్ వేదవతి అట యెవరో !

శంకరానికి ఎక్కడలేని ఆగ్రహం కల్గింది. కళ్ళు ఎర్రబడి అగ్ని గోళాలయ్యాయ్. ఎదురుగా వున్న తలుపులు తెరుచుకొని ఒక్క ఉదుటున లోన చొరబడ్డాడు. ఎదురుగుండా ఆఫీసరు కూర్చుని వున్నాడు.

'మీరు సెలెక్టు చెయ్యటంలో పొరపాటు చేసారు' అన్నాడు ఆవేశంగా శంకరం.

'పొరపాటా ?' మొహం చిట్లించాడు ఆఫీసరు.

ఆఫీసరు వైఖరికి భగ్గున మండింది శంకరం హృదయం. గట్టిగా అన్నాడు. 'ఔను. పొరపాటు కాదు__ అన్యాయం చేశారు. నేను బి.ఏ. ఫస్టు క్లాసులో ప్యాసయ్యాను. వేదవతి పి.యు.సి. నాకన్నా ఆమె విద్యార్హత తక్కువ. అటువంటి ఆమెను అర్హురాలు అనడం చాలా అన్యాయం'

శంకరం దూకుడుకు కొంచెం కంగారు పడ్డాడు ఆఫీసరు. వెంటనే డ్రాయరులోంచి ఒక చిటీ తీసి చూపించాడు. అది మిస్ వేదవతి సంపాదించి తీసుకు వచ్చిన రికమెండేషన్ లెటరు.

కృంగిపోయాడు శంకరం అది చూసి.

అతనిలోని ఆవేశం ఒక్కసారిగా దిగిపోయింది.

'ఆఫీసరు నిమిత్తమాత్రుడు. అతనిమీదకు విరుచుకు పడటం తన అవివేకాన్ని చాటుతుంది తప్ప ప్రయోజనం లేదు' ఇది గ్రహించిన అతను భారంగా వెనుదిరిగి బయటకు నడిచాడు.

కాళ్ళీడ్చుకుంటూ నడుస్తున్న శంకరం మస్తిష్కం పూర్తిగా వేడెక్కింది. అతనిలో చెప్పలేనంత కసి బయలుదేరింది. నానాటికీ దిగజారిపోతున్న మనుషుల మీద, పతన మవుతున్న వారి మనస్తత్వాలమీద, యింకా ఈ కలుషిత సమాజాన్ని సర్వనాశనం చేసేద్దామన్నంత ఆవేశం కగిలింది. చివరకు__ఏమీ చెయ్యలేని అసహాయునిగా నిట్టూర్చాడు.

అతని స్మృతి పథంలో అకస్మాత్తుగా భార్య మెదిలి మనసు బాధతో మూలిగింది. 'ఇక ఈ జీవితమింతే ! ఇటువంటి జీవితాలు దేశంలో లెఖ్ఖలేనన్ని' కాని ఇవి ఏ విధంగా రాలిపోయేది ఎవరికీ తెలియదు.

తెలిసింది అందరికీ ఒక్కటే ! దేశం ప్రగతి పథంలోకి పయనిస్తోంది. ప్రతి మానవునికీ ప్రగతి ఫలం ముదుతుందని అందరికీ వినిపించేది రాజకీయనాయకుల మనోహరపు ఉపన్యాసం. తనలాంటి కన్నీటి జీవితాన్ని అర్థం చేసుకుని పరిపాలించే నాధుడుగానీ, ఆకలి మంటల్లోంచి పుట్టుకువచ్చే ఆర్తనాదం విని అభయమిచ్చి, ఆదుకునే రాజకీయ శక్తిగానీ లేదు.

రోజులు గడుస్తాయి, సంవత్సరాలు మారతాయి. అధికార బలంతో పెద్ద మనుషులనే వాళ్ళు కాల చక్రానికి ఒడుపుగా పగ్గాలువేసి తన కనుకూలంగా నడుపుకుంటారు.

ఈ సంఘమనే జగన్నాథ రథ చక్రాలక్రింద పడి నలిగిపోతూ చస్తున్న తనలాంటి అభాగ్యుల ఆర్తనాదం కడకు దేవుడికూడా వినిపించదు.

'ఇది అభాగ్యుల కథ ! ఈ కథ యెప్పటికీ మారదు !! మారనివ్వరుకూడా !!!'

అంతరంగం విపరీతమైన వేదన అనుభవిస్తుండగా నీరసంగా రెల్వేస్టేషన్ కేసి నడిచాడు శంకరం.

--SUGUNA




OUR AGENTS:

SRI LAKSHMI ENTERPRISES,
11, Arunachala Achari Street,
SALEM-1.

RENUKA AGENCIES,
3, Mandi Veerappa Lane,
BANGALORE-2.